మూఢనమ్మకాల నిర్మూలన సంఘం కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర - పలాస: కాశీబుగ్గ ఎస్సీ, ఎస్టీ రైల్వే కార్యాలయంలో మంగళవారం మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు పరిశీలకులుగా ఎం.ఎన్.ఎస్ జాతీయ అధ్యక్షులు బైరి నరేష్ వ్యవహరించారు. నూతన కార్యవర్గం: అధ్యక్షులుగా చాపర గీతారాణి, కార్యనిర్వాహక అధ్యక్షులుగా కుత్తుము లోకనాథం, ఉపాధ్యక్షులుగా నగిరి కరుణాకర్, ప్రధాన కార్యదర్శిగా తుంగాన సూర్యం, సంయుక్త కార్యదర్శిగా బట్టు ప్రేమ్చంద్, సహాయ కార్యదర్శిగా మామిడి గణపతి, ప్రచార కార్యదర్శిగా బోకర దుర్యోధన, అధికార ప్రతినిధిగా సార సోమేశ్వరరావు, కోశాధికారిగా బోకర కృష్ణవేణి, గౌరవ అధ్యక్షులుగా కొర్నాన ఉమావతి, సలహాదారులుగా పిట్ట జోగారావు, సిహెచ్ పద్మలోచన, జి.భీమారావు, బి.అప్పా రావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జిల్లాలో ఉద్యోగ విప్లవం సృష్టించాలి

- పరిశ్రమలు, పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలి
- త్వరలో 'ఇన్వెస్ట్ ఇన్ శ్రీకాకుళం' సదస్సు
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్: దేశంలో ఎక్కడికి వెళ్లినా ఉత్తరాంధ్రకు చెందిన కార్మికులు, ఉద్యోగులే కనిపిస్తారని.. స్థానికంగా ఉన్న మానవ వనరులను పరిశ్రమలు సద్వినియోగం చేసుకోకపోవడమే దీనికి కారణమని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తూ.. జిల్లాలో వేలాది మందికి ఉపాధి కల్పించేలా పరిశ్రమలు, పారిశ్రామికవేత్తలు ఉద్యోగ విప్లవానికి నాంది పలకాలని పిలుపునిచ్చారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో వివిధ పారిశ్రామిక సంస్థల యాజమాన్య ప్రతినిధులతో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సదస్సుకు ఆయన హాజరయ్యారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఎమ్మెల్యే గొండు శంకర్, సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్, ఏపీఎస్ఎస్డీసీ జిల్లా మేనేజర్ యూ.సాయికుమార్, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు మెండ దాసునాయుడు తదితరులు హాజరైన ఈ సదస్సులో ఆయన మాట్లాడారు. తన కార్యాలయంలో నిర్వహించే ప్రజాదర్బార్‌కు వచ్చే వినతులలో దాదాపు 70 శాతం ఉద్యోగాలకు సంబంధించినవే అని వెల్లడించారు. జిల్లాలో కొత్త పరిశ్రమలు, ఉపాధి కేంద్రాల ఏర్పాటు ద్వారానే దీనికి పరిష్కార మార్గం చూపవచ్చని సూచించారు. దీనికి అనుగుణంగా పారిశ్రామిక వేత్తలు, పరిశ్రమల ప్రతి నిధులు సహకారం అందించాలని కోరారు. జిల్లాకు చెందిన కార్మికులు ఎక్కడ ఉన్నా ఎంతో నిబద్ధత, నమ్మకంతో పని చేసే వారిగా గుర్తింపు ఉందని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. దీనిని ఇన్వెస్ట్ ఇన్ శ్రీకాకుళం పేరిట జిల్లాలో తొలిసారిగా పారిశ్రామిక వేత్తలతో సదస్సు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. కరోనా సమయంలో ఇంటి నుంచే పని విధానం విస్తారంగా ప్రాచుర్యంలోకి వచ్చిందని గుర్తు చేశారు. విశాఖలో పెట్టుబడులు పెట్టే ఐటీ పరిశ్రమలు దీనిని మరింత విస్తరించాలని, శ్రీకాకుళం జిల్లాలో పెట్టుబడులు పెట్టే విధంగా అవకాశాలను పరిశీలించాలని పిలుపునిచ్చారు. అంతకుముందు జిల్లాలో ఉపాధి అవకాశాలు, పరిశ్రమల కల్పనపై కలిగిన అవకాశాలపై కూడిన బుక్ లెట్‌ను ఆవిష్కరించారు. సదస్సులో ఫార్మా, గ్రానైట్, ఎలక్ట్రానిక్స్, బ్యాంకింగ్, టూరిజం, హెల్త్ కేర్, హాస్పిటాలిటీ, రిటైల్ తదితర రంగాలకు చెందిన హెచ్ఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పోరాటాలకు వేదిక 'సీపీఐ'

శత వార్షికోత్సవ వేడుకల్లో జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న

విశాలాంధ్ర - నరసన్నపేట: పోరాటాలకు వేదికైన సీపీఐ భారత స్వాతంత్ర్య సాధనలో అగ్రగామిగా నిలిచిందని, దున్నేవాడికే భూమి దక్కాలని ఉద్యమం చేసిందని సి.పి.ఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం పట్టణంలో సి.పి.ఐ శత వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా సి.పి.ఐ సీనియర్ నాయకులు, నెయ్యిల నారాయణరావు అరుణ పతాకాన్ని ఎగుర వేశారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ భూ సంస్కరణల చట్టం కోసం పోరాడి, లక్షలాది ఎకరాలు రైతాంగానికి భూ పంపిణీ చేసిందని తెలిపారు. అలాగే కార్మిక చట్టాలు, హక్కులు సాధన కోసం కనీస వేతనాల అమలు కోసం, కర్షక, మహిళా, విద్యార్థి, యువజన హక్కుల సాధనకై సిపిఐ నిర్విరామంగా పోరాడిందని అన్నారు. భారతదేశ గడ్డపై ఎర్ర జెండాకు వందేళ్ళ చరిత్ర ఉందని, ప్రజా పోరాటాల కోసం సిపిఐ దశలవారీగా ఉద్యమాన్ని చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు, ఎన్.టి.వి మధుసూధనరావు, సింహాద్రి భాస్కరరావు, వసంతరావు, మోహన్, రాములమ్మ, దశరథ, దాలిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలి

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ఈఆర్

విశాలాంధ్ర - రణస్థలం: అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి, లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించటానికి చర్యలు తీసుకోవాలని, నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయి, పూర్తి చేసిన వాటి పరిస్థితి, క్షేత్ర స్థాయిలో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకు రావాలని ఎమ్మెల్యే నడుకుదిటీ ఈశ్వరరావు అన్నారు. హౌసింగ్ ఏఈలు, వర్క్ ఇన్స్పెక్టర్‌లు, ఇంజి నీరింగ్ అసిస్టెంట్‌లతో నిర్వహించిన రివ్యూ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో పలువురు కూటమి నాయకులు ముప్పిడి సురేష్, తోటయ్య దొర, జగన్నాథం నాయుడు తదితరులు ఉన్నారు.

ధ్యానం ద్వారా ఒత్తిడిని అధిగమించొచ్చు

విశాలాంధ్ర - పొందూరు: ధ్యానం చేయడం ద్వారా దు:ఖ స్థితినుంచి ఆనందకరమైన స్థితిని చేరుకోడానికి ఉపయోగపడుతుందని ఏకం క్షేత్రం (వరదయ్య పాలెం) ప్రతినిధి చంద్రశేఖరదాసాజీ హితవు పలికారు. మంగళవారం స్థానిక పట్టుశాలి కళ్యాణ మండపంలో నిర్వహించిన ఏకం అనుగ్రహ ఆధ్యాత్మిక జాగృతి కార్యక్రమంలో దాసాజీ పాల్గొని మార్గదర్శనం చేశారు. శారీరక, మానసిక ఆరోగ్యం కోసం నిశ్చలమైన ప్రార్థన దోహదం చేస్తుందన్నారు. ధ్యానం కేవలం ఏడు నిమిషాలు చేస్తే సరిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల నుంచి సాధకులు, ధార్మిక సేవకులు పాల్గొన్నారు.

రబీపంటల బీమా పథకంపై అవగాహన

విశాలాంధ్ర - జలుమూరు: రవి పంటల బీమా పథకం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనపై రైతులకు జలుమూరు వ్యవసాయ అధికారి కొంక్యాన సురేష్ అవగాహన కల్పించారు. జలుమూరు మండలం తదిత్రియ, లింగాలవలస రైతు సేవా కేంద్ర పరిధిలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో రబీలో సాగు చేసే పంటలలో మినుము పెసర పంటకు 300 రూపాయలు చొప్పున, మొక్కజొన్నకు 570 రూపాయలు, వరికి 630, రాగి పంటకు 240, వేరుశనగకు 480 రూపాయల వంతున ఎకరానికి రైతులు వాటాగా కట్టవలసినటువంటి ప్రీమియం సొమ్మును ఫీచర్ జనరల్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ పేరు మీద డిసెంబరు 30 తేదీ లోపల మీసేవ కేంద్రాల్లో చెల్లించాలన్నారు. ఆయనతో పాటు సర్పంచ్ షణ్ముఖరావు, వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

తడిచిన ధాన్యానికి ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలి

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : రెండు రోజుల క్రితం కురిసిన అకాల వర్షాలతో పంటలకు ఏర్పడ్డ ఇబ్బందులను వ్యవసాయ సహాయ సంచాలకులు జగన్మోహన్, డాక్టర్ అనూష, వ్యవసాయాధికారి టి. భార్గవి, బి. నర్సింహమూర్తి తదితరులు మంగళవారం పరిశీలించారు. బెల్లుపడా, ఈదుపురం పరిధిలోని పంట పొలాల్లో తడిచిన ధాన్యం, తడిచిన పన్నలు, నేలకు ఒరిగిన వరి పంట పొలాలను సందర్శించి వ్యవసాయదారులకు సూచనలు చేసారు. తడిచిన ధాన్యానికి ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలని కోరారు. వ్యవసాయ సహాయకులు మల్లేశ్వర రావు, నీటి సంఘం అధ్యక్షులు కొచెర్ల ధనుంజయ్ తదితరులు ఈ పర్యటనలో పాల్గొన్నారు. రైతులకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి నివేదికను జిల్లా అధికారులకు పంపి ఉపసమనం కల్గించేలా చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

డీలర్‌పై 6ఎ కేసు నమోదు

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు చౌక డిపో డీలర్ కథంబాల ఉమామహేశ్వరిపై 6ఎ కేసు నమోదు చేసినట్లు వజ్రపుకొత్తూరు మండల పౌర సరఫరాల ఉప తహశీల్దార్ మురళీ కృష్ణ తెలిపారు. మంగళవారం వజ్రపుకొత్తూరులోని చౌక డిపో కేంద్రాన్ని తనిఖీ చేశామని తెలిపారు. ఈ సందర్భంగా పేద ప్రజలకు ప్రభుత్వం సరఫరా చేసే వినియోగ వస్తువుల్లో అవక తవకలు జరిగినట్లు గుర్తించామని తెలిపారు. రికార్డ్ పరంగా ఉండవలసిన దాని కంటే బియ్యం 845 కిలోలు, పంచదార 34 పాకెట్స్ తక్కువ ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. వివరాలు ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆయన తెలిపారు.

108 వాహనం వచ్చేలా మార్గం చూపండి

విశాలాంధ్ర - టెక్కలి: మండలంలో స్థానిక ఎన్టీఆర్ కాలనీ పోలీస్ స్టేషన్ వెనుక భాగం నుండి రోడ్డు మార్గం లేనందున అత్యవసర సమయంలో 108 వాహనాలు ఎన్టీఆర్ నగర్ లోపలికి రావడానికి ఇబ్బందికరంగా ఉంటుందని వీధివాసులు మంగళవారం నిరసన చేపట్టారు. గత ప్రభుత్వంలో ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులకి, ప్రభుత్వ అధికారులకు కలిసిన సమస్యకి పరిష్కారం దొరకలేదని వాపోయారు. హార్ట్ ఎటాక్ వంటి అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ రాక చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు. గతంలో ఆదిత్య కల్యాణ మండపం పక్కనుండి గ్రావెల్ రోడ్డు ఉండేదని, ఆ మార్గాన్ని దేవాదాయ శాఖవారు కంచె వేయడం జరిగిందిని, కొంతకాలం పోలీస్ స్టేషన్ పక్కనుండి మార్గం ఉండేదిని, ఆ మార్గాన్ని కూడా పోలీసు శాఖ వారు కంచె వేయడంతో స్కూలుకు వెళ్లే పిల్లలు, హాస్పిటల్‌కి వెళ్లే రోగులు, బస్టాండ్‌కి వెళ్ళే ప్రజలు చుట్టూ తిరిగి ఇబ్బంది పడుతున్నామని దిగులు చెందుతున్నారు. ఈ సమస్యపై ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డు మార్గం చూపుతారని ఎన్టీఆర్ నగర్ ప్రజలు కోరుకుంటున్నారు.

20 సూత్రాల కమిటీ ఛైర్మన్‌ను కలిసిన సిరిపురం తేజేశ్వరరావు

విశాలాంధ్ర - కొత్తూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ 20 సూత్రాల కమిటీ ఛైర్మన్ లంక దినకర్‌ను పాతపట్నం బీజేపీ నేత సిరిపురం తేజేశ్వరరావు కలిశారు. ఆయన మంగళవారం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువాతో సత్కరించారు.

విషాదం మిగిల్చిన నిద్ర మత్తు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

విశాలాంధ్ర - కంచిలి: కంచిలి మండలంలోని చిన్న కొజ్జిరియా జాతీయ రహదారి వద్ద మంగళ వారం ఉదయం 9 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో విశాఖపట్నంకి చెందిన ముగ్గురు వ్యక్తులు మృతి చెందగా మరొకరి పరి స్థితి విషమంగా ఉంది. ఈ మేరకు కంచిలి పోలీ సులు బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖపట్నంకి చెందిన ముత్తా వెంకట రంగ రాజేష్ తన కుటుంబ సభ్యులు ఐదుగురితో కలసి ఒడిస్సా జాజిపూర్‌లోని తరిణి అమ్మవారి దేవాలయానికి మొక్కు తీర్చుకునేందుకు వెళుతుండగా చిన్న కొజ్జిరియా జంక్షన్ వద్ద కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీ కొట్టింది. తన కుమార్తె నేహ గుప్తకు పాట్న ఐఐటీలో సీటు వచ్చిన నేపథ్యంలో మొక్కు తీర్చుకునేందుకు వెళుతున్నారు. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న అతడి భార్య ముత్త లావణ్య (43), కుమార్తె నేహ గుప్త (19), తోడి అల్లుడు కే.సోమేశ్వరావు (49) మృతి చెందారు. మరదలు కే.రాధిక, తల్లి సుబ్బలక్ష్మిలు గాయాల పాలయ్యారు. సంఘటన స్థలానికి చేరుకున్న కంచిలి పోలీసులు అక్కడికక్కడే మృతి చెందిన లావణ్య మృతదేహంతో పాటు క్షతగాత్రులను సోం పేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసు పత్రికి తరలిస్తుండగా నేహ గుప్త, సోమేశ్వరరావు మృతి చెందగా రాధిక పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. రాధికను మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి కంచిలి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న కాశీబుగ్గ డి.ఎస్.పి వి.వెంకట అప్పారావు, సిఐ మంగరాజు, కంచిలి ఎస్సై పారినాయుడు ఆసుపత్రి వద్దకు వచ్చి బాధితులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రజకుల జీవోని అమలు చేయాలి

- రాష్ట్ర డైరెక్టర్ గురజాపు రాము

విశాలాంధ్ర - రణస్థలం: రజకుల కోసం కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఓలను ఆయా జిల్లా అధికారులు అమలు చేయాలని విజయనగరం జిల్లాకు చెందిన రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ గురజాపు రాము అధికారులను కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రజకులు అభివృద్ధికి ముఖ్య మంత్రి నారా చంద్ర బాబు నాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు. రజకుల అభివృద్ధి కొరకు ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవోలు అన్ని జిల్లాస్థాయి అధికారులు అమలు చేయాలని రాము కోరారు. జీవో నెంబర్ 27 ప్రకారం ప్రభుత్వ కార్యాలయాల్లో దోబీ పోస్టులను దోబీ కాంట్రాక్టులను దోబీలకే కేటాయించాలని కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ సి.సావిత్రి ఇటీవల ప్రభుత్వాన్ని కోరారని తెలిపారు. అలాగే అన్ని జిల్లాల్లో ఈ జీవోలు అమలయ్యే విధంగా జిల్లాస్థాయి అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. తొలుత రజక సంఘం నాయకులు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రజక సాధికారక కమిటీ సభ్యులు ధర్మవరపు శంకర్, సోపేటి రామారావు, జొన్నాడ భాస్కర్, దమరసింగు మహాలక్ష్మునాయుడు, తామాడ ప్రసాద్, కోష్ఠ పాపారావు, శీల సురేష్, లక్ష్మి, సత్యం, చిట్టితల్లి, అచ్చన్న, నాగరాజు, అప్పలస్వామి, శ్రీను, గురుమూర్తి, అప్పలరాజు, కృష్ణ తదితరులు ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ మెంబర్‌గా ధనుంజయ్

విశాలాంధ్ర - ఆమదాలవలస: జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గల ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ మెంబర్‌గా స్థానిక మండల కన్స్యూమర్ ఫోరం అధ్యక్షుడు టి. ధనుంజయరావును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ వారు తనకు ఉత్తర్వులు కాపీ అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కమిటీకి జిల్లా కలెక్టర్ ఛైర్మన్ గాను, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ జిల్లా ఎంపీ, ఎమ్మెల్సీ, శాసనసభ్యులు కీలక ప్రతినిధులు గాను, మరో ఆరుగురు సభ్యులు ఉంటారని ధనుంజయరావు తెలిపారు. తన నియామకం పట్ల జిల్లా కలెక్టర్ వారికి, స్థానిక శాసనసభ్యులకు, డిప్యూటీ డైరెక్టర్ వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ధనుంజయరావు తెలిపారు.

ఐతమ్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర - టెక్కలి: ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి శాంతి, సౌభాగ్యాలు ప్రజలందరికీ కలగాలని ఆకాంక్షిస్తూ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్లు, అసోసియేట్ డీన్లు, హెచ్ఓడీలు, కెరీర్ గైడెన్స్ సెల్ ఇన్చార్జ్ డాక్టర్ డి.యుగందర్ తదితరులు పాల్గొని విద్యార్థులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

రైతులకు భూహక్కులు కల్పించాలి

- ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్

విశాలాంధ్ర - కవిటి: కవిటి మండలం బైరిపురం గ్రామంలో సర్వే నెం.143, 169, 170, 171లలో సుమారు 42.05 సెంట్ల విస్తీర్ణం భూమిని 1975వ సంవత్సరంలో ఆ గ్రామంలోని 100 మంది నిరుపేద కుటుంబాలకు అప్పటి ప్రభుత్వం బంజరు భూమి (పశువుల బీడు) డి పట్టాల రూపంలో అందజేసింది. వారికి భూహక్కు పత్రాలు లేనందున క్రయ, విక్రయాలు, బ్యాంకులో వ్యవసాయ రుణాలు పొందలేకపోతున్నారు. తక్షణమే వారికి భూహక్కు పత్రాలు అందజేయాలని ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కోరారు. మంగళవారం శ్రీకాకుళంలో ఆయన్ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ భూహక్కు పత్రాలు లేక పీఎం కిసాన్, సమ్మన్ నిధి, రాష్ట్ర ప్రభుత్వం అందించే అన్నదాత సుఖీభవ లాంటి ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారని తెలిపారు. గత 50 ఏళ్లుగా అనుభవిస్తున్నా ప్రయోజనం లేకుండా పోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామానికి చెందిన సీపాన వెంకటరమణ, పుల్లట రాజు తదితరులు పాల్గొన్నారు.

నిద్ర మత్తులో డ్రైవర్..దూసుకుపోయిన లారీ

విశాలాంధ్ర - ఎచ్చెర్ల: ఫరీద్పేట జంక్షన్‌కు సమీపంలో మంగళవారం వేకువజామున ఓ లారీ డ్రైవర్ నిద్రమత్తు కారణంగా జాతీయ రహదారి డివైడర్ ఎక్కి ఐరన్ రెయిలింగ్ వైపు దూసుకుపోయి సర్వీసు రోడ్డులో అడ్డంగా తిరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్న లారీ.. ఈ జంక్షన్‌కు వచ్చే సరికి డ్రైవర్ నిద్రమత్తు వల్ల స్టీరింగ్ అదుపుతప్పింది. దీంతో డివైడర్ ఎక్కి కొద్ది దూరం వరకు ఐరన్ రెయిలింగ్ దాటి దూసుకువచ్చి సర్వీసు రోడ్డులో అడ్డంగా తిరిగింది. దీనివల్ల సర్వీసు రోడ్డులో మధ్యాహ్నం వరకు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆ సమయంలో సర్వీసు రోడ్డులో వాహనాల రాకపోకలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. ఇటీవల ఇదే జంక్షన్ వద్దనే కొబ్బరి బొండాల లారీ డివైడర్ పైకి దూసుకువచ్చి హైటెన్షన్ విద్యుత్ తగలు స్థంబాన్ని ఢీకొట్టిన విషయం తెలిసిందే.

ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

విశాలాంధ్ర - ఎచ్చెర్ల: ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు కృషిచేస్తానని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ట్రిపుల్ ఐటీ క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో ముని రామకృష్ణలు నడుకుదిటీవానిపాలెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం కలిసి క్యాంపస్‌లో సౌకర్యాలు మెరుగపర్చాలని కోరారు. క్యాంపస్లో అంతర్గత రోడ్డు నిర్మించాలని, అసంపూర్తిగా ఉన్న ప్రహరీని పూర్తిచేయాలని, తాగునీటికి శాశ్వత పరిష్కారం చూపాలని ఎమ్మెల్యేను కోరారు. అదనపు తరగతి గదులు, వసతి గృహం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరినట్టు ట్రిపుల్ ఐటీ అధికారులు చెప్పారు. అలాగే ఎచ్చెర్ల పాత జాతీయ రహదారి నుంచి క్యాంపస్ వచ్చే వరకు రహదారి పొడవునా విద్యుత్ దీపాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కోరామన్నారు. వీటిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారన్నారు. రహదారి పొడవునా దీపాల కోసం సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే వెంటవెంటనే మాట్లాడారని, మిగిలిన సమస్యలను విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామని ఎమ్మెల్యే చెప్పారన్నారు.

గో మాంసం విక్రయదారులపై చర్యలు తీసుకోవాలి

బీజేపీ ధార్మిక పరిషత్ జాయింట్ కన్వీనర్ కళ్యాణి

విశాలాంధ్ర - నరసన్నపేట: గోమాంసం విక్రయదారులపై పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలంగాణ బీజేపీ ధార్మిక పరిషత్ జాయింట్ కన్వీనర్, అఖిల భారత యాదవ సంఘ జాతీయ కార్యదర్శి శ్రీ ఆదిభట్ల, శ్రీ కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షురాలు, గో రక్షకురాలు, సినీనటి, కరాటే కళ్యాణి అన్నారు. మంగళవారం ఆమె ఒడిస్సా నుండి విజయనగరం వెళ్తూ, మండలంలోని తామరాపల్లి గ్రామ సమీపంలో ఉన్న దాభా వద్ద భోజనం కోసం ఆమె ఆగారు. దాభా యజమాని ఆజాద్‌కు మెను అడుగగా ఆవు మాంసం ఉందని తెలిపారు. ఈ విషయమై ఆమె స్పందిస్తూ ఆవు మాంసం విక్రయిస్తున్న ఆజాద్‌పై స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గోవును తల్లిగా భావించే మనకు ఆవు మాంసాన్ని విక్రయించటం విచారకరమని, అంతేకాక జిమ్‌కు వెళ్ళిన యువకులకు గో మాంసం తింటే బలంగా ఉంటారని భయం లేకుండా చెప్పటం ఆశ్చర్యానికి గురి చేస్తుందన్నారు. ఈ కార్యక్ర మంలో గో రక్షకులు దత్తు, పృధ్వీ, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు, ముచ్చేటి సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.

నిధులు తెచ్చే బాధ్యత నాది... అభివృద్ధి బాధ్యత మీది

- అన్ని శాఖల అభివృద్ధిపై నివేదికలు సిద్ధం చేసుకోవాలి
- జిల్లా అభివృద్ధిపై ప్రతీనెలా సమీక్షలు జరపాలి
- దిశ కమిటీ సమీక్షలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

విశాలాంధ్ర - శ్రీకాకుళం: కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లా మరింత ప్రగతి సాధించేలా అన్ని శాఖల అధికారులు చొరవ చూపాలని, జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) ఛైర్మన్, కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సూచించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన 'దిశ' సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా సమగ్రాభివృద్ధికి అధికారులు ప్రణాళికలు రూపొందిస్తే ఎన్డీఏలో కేంద్ర మంత్రిగా ఉన్న తాను ఆయా కేంద్ర ప్రభుత్వ శాఖలలో మాట్లాడి, ప్రత్యేకంగా నిధుల కేటాయింపులు జరిగేలా చూస్తానని చెప్పారు. జిల్లా అభివృద్ధికి కావాల్సిన నిధులు, పనుల గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. అన్ని రంగాల్లో జిల్లా అభివృద్ధి కోసం అన్ని శాఖల అధికారులు నివేదికలు సిద్ధం చేసుకోవాలని, ప్రతినెలా సమీక్షలు జరిపి ఎప్పటికపుడు సలహాలు, సూచనలు తీసుకొని అభివృద్ధి పనులు వేగంగా జరిగేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం పనుల ద్వారా గ్రామాలను అభివృద్ధి చేసి, పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్న నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంక దినకర్ మాట్లాడుతూ సరైన ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో గత ఏడాది ఉపాధి హామీ పథకానికి సంబంధించిన ఒక్క శ్రీకాకుళం జిల్లాలోనే రూ.230 కోట్ల నిధులు వెనక్కి వెళ్ళిపోయాయని, గడిచిన ఐదేళ్ల లెక్క చూస్తే రూ. 1000 కోట్లకు పైగా పనులు చేసుకోలేకపోయామని, ఇది క్షమార్హం కాదని పేర్కొన్నారు. ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం శాసనసభ్యులు బెందాళం అశోక్ మాట్లాడుతూ జల జీవన్ మిషన్ నిధులతో ఉదానంలో గత ప్రభుత్వం చేపట్టిన మంచినీటి పథకంలో పెద్ద ఎత్తున నిధుల దుర్వినియోగం జరిగిందని అన్నారు. ఆమదాలవలస శాసనసభ్యులు కూన రవికుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం పేదలకు ఇళ్ల నిర్మాణం పేరుతో పెద్ద కుంభకోణమే చేసిందని ఆరోపించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో విజయ నగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, నరసన్నపేట, పలాస, శ్రీకాకుళం శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి, గౌతు శిరీష, గొండు శంకర్‌లు వారి వారి నియోజకవర్గాల్లో ఎదుర్కొంటున్న పలు సమస్యలపై మాట్లాడారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జెడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, సిపిఓ ప్రసన్నలక్ష్మి, 33 ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా అధికారులు హాజరయ్యారు.



సమస్యల పరిష్కారానికి శ్రద్ధ వహించండి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో సమస్యలను ఎన్ని సార్లు అధికారులకు వివరించినా పట్టించుకునే పరిస్థితుల్లో లేరని పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లో ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీడీఓ కె. రామారావు సమన్వయంతో ఎంపీపీ బోర పుష్ప అధ్యక్షతన మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఎంపీటీసీలు గ్రామాల్లో సమస్యలు ప్రస్తావించారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంట నష్టపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఒక చోట ఉన్న రేషన్ లబ్ధిదారుల కార్డులకు దూరంలో ఉండే మరో డిపోకు తరలించడం దారుణమని సమావేశంలో ప్రస్తావించారు. అధికారులు గ్రామ స్థాయిలో సమస్యలను పరిష్కరించడానికి శ్రద్ధ వహించాలని పలువురు సభ్యులు సూచించారు. కేశుపురం సర్పంచ్ ఢిల్లీరావు మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన 64 కార్డులు సన్యాసిపుట్టుగ డిపోకు తరలించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తక్షణం సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కళ్లాల్లో ధాన్యం తడిసి రైతులు నష్టపోయారని క్షేత్రస్థాయిలో విచారణలు జరిపి న్యాయం చేయాలని బిర్లంగి ఎంపీటీసీ దక్కత ఏకాంబరి కోరారు.

స్పందించిన వ్యవసాయాధికారిణి భార్గవి మాట్లాడుతూ మండలంలో 700ఎకరాల్లో వరి చేలు నీట మునిగాయని, రైతులను కలిసి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించామని, నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపి వారికి న్యాయం చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరణ ఇచ్చారు. సమావేశానికి ఎమ్మెల్సీ నర్తు రామారావు గౌరవ అతిథిగా హాజరవ్వగా జెడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-రణస్థలం: రణస్థలంలో క్యాంప్ ఆఫీస్ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం డెమొక్రటిక్ అసోసియేషన్ 69/21 2025వ సంవత్సరం వార్షిక క్యాలెండర్‌ను విజయనగరం ఎం.పీ కలిశెట్టి అప్పలనాయుడు చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల పనితీరు చాలా మెరుగుపడిందని ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయటంలో వీరి పాత్ర ఎనలేనిదని అన్నారు. రానున్న రోజులలో అత్యధిక శాతం యువకులే ఉన్న సచివాలయ ఉద్యోగుల సేవలను ఎలా వినియోగించుకోవాలో ప్రభుత్వం యోచిస్తుందని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు జి కిరణ్ కుమార్, విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం చంద్రశేఖర్, శ్రీకాకుళం జిల్లా జాయింట్ సెక్రటరీ లక్ష్మణరావు,ఆదినారాయణ,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి కార్యక్రమాలపై శిక్షణ

ఏపిఎం పైడి కూర్మారావు

విశాలాంధ్ర-మందస: గ్రామీణ ప్రాంతంలో మహిళలు తీసుకున్న రుణాలను ఆదాయ అభివృద్ధి పెంపుదలకు ఉపయోగించుకునేట్లు స్వయం ఉపాధి కార్యక్రమాలపై శిక్షణ ఇప్పుడున్నట్లు వెలుగు ఐటిడిఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు.సోమవారం మండల పరిధిలో గల

సొండిపూడి ,మూలిపాడు పరిసర ప్రాంతాలలో స్వయం ఉపాధి కార్యక్రమాలపై ఆసక్తి ఉన్న సంఘ మహిళలను గుర్తించి వారికి కొవ్వొత్తుల తయారీ, డిటర్జెంట్ సర్ఫ్ పౌడర్ తయారీ, శానిటరీ కార్యక్రమాలకు ఉపయోగించే ఫినాయిల్ తయారీ పై శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శిక్షణ కార్యక్రమం రాజాం జి.ఎం.ఆర్ .నాగావళి గ్రామీణ ఉపాధి శిక్షణాభివృద్ధి సంస్థ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సంఘం ప్రతినిధులతో పాటు సంస్థ ప్రతినిధులు రాంబాబు, లక్ష్మీ, క్లస్టర్ కోఆర్డినేటర్లు బాలకృష్ణ, కిషోర్ ,స్వామి నాయుడు సొండిపూడి మూలిపాడు వి.వో.ఏ.లు కుసుమ ,తులసి తదితరులు పాల్గొన్నారు.

రబీలో ఆరుతడి పంటలు వేసుకోవాలి

వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రవీంద్రభారతి

విశాలాంధ్ర-నరసన్నపేట: రబీలో రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని నియోజకవర్గ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, కె.రవీంద్రభారతి అన్నారు. మంగళవారం మండలంలో పోదవరం, నడగాం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం రైతుల వ్యవసాయ భూముల్లో వేసిన మినుము, పెసర పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏ.డి, రవీంద్రభారతి మాట్లాడుతూ రబీలో వరి పంటలు వేయరాదని, సాగునీరు అందకపోతే రైతులు ఆర్థికంగా నష్టపోతారన్నారు. అలాగే రైతులకు మట్టి నమూనా పత్రాలను అందచేసి, తుఫాన్, ఉష్ణోగ్రతలు దృష్టిలో పెట్టుకొని రైతులు తాము పండించిన పంటలపై టార్పాలిన్లు కప్పి వేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏ.ఓ, కె.సునీత, పోదవరం, నడగాం అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు, ప్రమీల, స్రవంతి, రైతులు పాల్గొన్నారు.

అభిమానం చూరగొనడంతోనే ఉద్యోగులకు గౌరవం

విశాలాంధ్ర-పొందూరు: విధినిర్వహణలో తోటి ఉద్యోగులతో పాటు ప్రజల అభిమానం చూరగొనడమే ఉద్యోగులకు నిజమైన గౌరవమని తోలాపి జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం వి.సత్యరాజు అన్నారు. పాఠశాలలో రికార్డుస్థాయిలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన టి.గజపతిని మంగళవారం ఉపాధ్యాయులు. విద్యార్థులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

పాఠశాలనుంచి బదిలీపై గజపతి వెళ్లడంతో విద్యార్థులు సైతం కన్నీరు పెట్టుకున్నారని అన్నారు. గజపతి సేవలను ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొని దుశ్శాలువ, మెమెంటోతో ఘనంగా సన్మానించారు.

పురవీధుల్లో హోరెత్తిన క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర - పొందూరు: మండలంలోని కొంచాడ, లోలుగు, యాగాదిపేట, పొందూరు వంటి పలు గ్రామాలలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. మంగళవారం నుండి ప్రారంభమైన ఈ వేడుకలు పురవీధుల్లో హోరెత్తించారు.

ప్రధాన చర్చిలలో విద్యుత్ అలంకరణ అద్భుతంగా నిలిచింది. ఏసు నామ కీర్తనలు హోరెత్తించారు. పలు గ్రామాల్లో పాస్టర్లు ఏసు కీర్తనలతో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. లోక రక్షకుడైన యేసు కీర్తనలతో భక్తులను ఆకట్టుకున్నారు. చిన్నారులు క్రిస్మస్ తాతల వేషధారణలతో చూడముచ్చటగా అలంకరించారు. ప్రధాన కూడళ్లలో కంజర ధ్వనులతో పాడిన పాటలకు గుమిగూడిన జనం గొంతు కలిపారు. క్రిస్మస్ జానపద నృత్య పాటలకు ప్రజలను ఆకర్షితులుగా మార్చారు.

బ్రిలియంట్ స్కూల్లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర-టెక్కలి: మండలంలో స్థానిక బ్రిలియంట్ స్కూల్లో ముందస్తు క్రిస్మస్ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రిలియంట్ ప్రిన్సిపల్ శోభారాణి ఆధ్వర్యంలో విద్యార్థులు క్రిస్మస్ శుభాకాంక్షలు

తెలిపారు. క్రిస్మస్ పండగ గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం క్రిస్మస్ తాత (శాంతాక్లాస్) వేషధారణలో విద్యార్థులు అందరు ఆకట్టుకున్నారు. విద్యార్థులు ప్రదర్శించిన క్రీస్తు జననం నాటిక, అభినయ నృత్యాలు, శాంతా క్లాస్ ప్రదర్శన అందర్నీ విశేషంగా ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో బ్రిలియంట్ స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీ ఏమైంది ?

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : రైతులకు పెట్టుబడి సహాయం క్రింద 20 వేల రూపాయలు ఇస్తామని వాగ్దానాలు చేశారని ఎమ్మెల్సీ నర్తు రామారావు ప్రస్తావించారు. మంగళవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మలతో కలిసి పాత్రికేయులతో మాట్లాడుతూ అధికారంలో ఉన్న ప్రభుత్వం ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీ ఏమైందని అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వందలాది ఎకరాల్లో పంట నీట మునిగి వరి చేలు పూర్తిగా దెబ్బతిన్నాయని, రైతులు

తీవ్రంగా నష్టపోయారని, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులను ఆదుకుంటామని ప్రకటనలు ఇవ్వడం కాదని, చిత్తశుద్ధితో వ్యవహరించి, పంట నష్టం పరిహారాన్ని అందివ్వాలని కోరారు.

దుర్గా గురుస్వామి ఆకస్మిక మరణం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : గత ఐదు దశాబ్దాలుగా ఎందరో అయ్యప్ప స్వామి భక్తులకు మాలధారణలు జరిపించి, భక్తి మార్గంలో నడిపించిన వ్యక్తి మరణించడంతో అయ్యప్ప దీక్షల్లో ఉన్న వారితో పాటు చాలా మంది దిగ్భ్రాంతికి గురయ్యారు. పట్టణంలో శ్రీ స్వేచ్ఛావతిలో అయ్యప్ప ఆరాధనా పీఠం వ్యవస్థాపకులు దుర్గా ప్రసాద్ పట్నాయిక్ (65) గురుస్వామి మంగళవారం ఉదయం ఆకస్మాత్తుగా మరణించారు. వేకువఝామునే లేచి ఆలయంలో పూజాకార్యాలు పూర్తి చేసిన ఆయన అస్వస్థతకు గురవ్వడంతో కుమారుడు మణికంఠ స్థానికుల సహాయంతో ప్రైవేటు నర్సింగ్ హోంకు తరలించారు. చికిత్స పొందుతూనే దుర్గా గురుస్వామి తుది శ్వాస విడిచారు. అయ్యప్ప గురుస్వామిగా పట్టణంలో, మండలంలో పాటు పొరుగున ఒడిశా జల్లింద్ర, సున్నాపురం, గొళంత్ర, సుమండి, పేటూరు తదితర చాలా గ్రామాల్లో ఆయన అనుచరులు ఉన్నారు. శ్రీ స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయ నిర్వాహణలో గత కొంత కాలం వరకు ప్రధాన పాత్ర పోషిస్తునే అక్కడే అయ్యప్ప దీక్షా పరులకు మాలధారణ మొదలు యాత్ర సాగించే వరకూ అన్ని పట్ల పలువురు ప్రముఖులు సంతాపాన్ని వ్యక్తం చేశారు. దుర్గా గురుస్వామి మరణం

పెండింగ్ కేసులు, ప్రాపర్టీ కేసుల

దర్యాప్తు వేగవంతం చేయాలి

– ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: అపరిష్కృతంగా ఉన్న ప్రాపర్టీ కేసులు, మహిళలకు సంబంధించిన కేసులు పై దృష్టి కేంద్రీకరించి వేగవంతంగా దర్యాప్తు పూర్తి చేయాలని, జిల్లాలో గంజాయిని పూర్తి స్థాయిలో అరికట్టాలని, పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలో డిఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో జిల్లాలోని ముఖ్యమైన కేసులు గురించి జిల్లా ఎస్పీ నెల వారి నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ముందుగా ముఖ్యమైన ప్రాపర్టీ కేసుల గురించి ఆరా తీస్తూ, ప్రాపర్టీ కేసులలో ఇప్పటికే ముద్దాయిలు అరెస్ట్ అయిన కేసులలో త్వరిత గతిన ఛార్జ్ షీట్ దాఖలు చేసి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో స్వీకరించిన ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇస్తూ నాణ్యమైన విచారణ జరిపి, బాధితులకు చట్ట పరిధిలో న్యాయం చేకూర్చాలని అట్టి ఫిర్యాదులపై ఎటువంటి నిర్లక్ష్యం వహించకుండా పరిష్కారం చూపాలని అన్నారు. ప్రతిరోజు గ్రామాలలో సందర్శించి గ్రామాల్లో ఉన్న పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించి ఎటువంటి తగాదాలు, నేరాలు జరగకుండా ముందస్తు సమాచారాన్ని సేకరించాలన్నారు. అలానే ఇప్పటి వరకు మొత్తం జిల్లాలో ఉన్న యుఐ కేసుల గురించి ఆరా తీసి, లాంగ్ పెండింగ్ దర్యాప్తు లో ఉన్న కేసులలో నైపుణ్యం గల దర్యాప్తును చేస్తూ తొందరగా పూర్తి చేయాలని సూచించారు. తరువాత పోలీస్ స్టేషన్ వారీగా ఉన్న కేసుల వివరాలు తెలుసుకొని, కేసుల యొక్క దర్యాప్తు తొందరగా పూర్తి చేయాలని, ఆక్సిడెంట్ కేసులు, పెండింగ్ ఎన్బిడబ్ల్యూ ల గురించి అడిగి తెలుసుకున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో దొరికిన వ్యక్తుల యొక్క డ్రైవింగ్ లైసెన్సు లు సీజ్ చేయాలని, ఎన్ఫోర్స్మెంట్ వర్క్ పై దృష్టి కేంద్రకరించి, పేకాట శిబిరాలు పైన, బెల్టు షాపుల పైన తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది తప్పనిసరిగా గ్రామ సందర్శనలు చేయాలని, ప్రజలతో మమేకమై గ్రామాల్లో సమస్యలను గుర్తించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులు ను గుర్తించి, ప్రాథమిక స్థాయిలోనే ఆయా వ్యక్తులను ముందస్తుగా బైండ్ ఓవర్ చేయాలన్నారు. గంజాయి నియంత్రణకు అత్యధిక ప్రాధాన్యతని ఇవ్వాలని, గంజాయి కేసుల్లో అరెస్టు కాబడిన నిందితులపై నిరంతర నిఘా పెట్టాలన్నారు. నిరంతరం వాహన తనిఖీలచేస్తూ, జిల్లాలో పూర్తి స్థాయిలో అక్రమ రవాణాను అరికట్టాలని, తప్పుడు నెంబర్ ప్లేట్ లు ఉన్న వాహనాలను గుర్తించాలని, ముఖ్యంగా సరిహద్దు చెక్ పోస్టుల వద్ద ఉన్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సంకల్పం పేరిట ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాలు పై

విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అదే విధంగా సైబర్ నేరాలు, రోడ్ సేఫ్టీ పై ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాత ముద్దాయిలపై ప్రత్యేకంగా నిఘా ఉంచి వారి కదలికలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఇంతవరకు సంబంధిత అధికారులు చేపట్టిన దర్యాప్తును పరిశీలించి, దర్యాప్తు పూర్తి చేసేందుకు అధికారులకు జిల్లా ఎస్పీ దిశా నిర్దేశం చేశారు. రాత్రి వేళల్లో గస్తీ విధుల్లో అప్రమత్తంగా తిరుగుతూ పాత నేరస్తులను తనిఖీ చేసి నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం రద్దీ ప్రదేశాలు, మార్కెట్ ప్రాంతాలు, బ్యాంకులు, కళాశాలల వద్ద విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి అసాంఘిక కార్యకలాపాలు, ఆకతాయిలను కట్టడి చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు ఎస్పీ కెవి రమణ, డీఎస్పీలు వివేకానంద, మూర్తి, ఏఓ గోపీ నాథ్, జిల్లా వ్యాప్తంగా ఉన్న సీఐలు,ఎస్ఐ పాల్గొన్నారు.

మీకు అన్నివేళలా అండగా ఉంటా : కలెక్టర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్: మీకు అన్నివేళలా అండగా ఉంటా, ప్రశాంత వాతావరణంలో క్రిస్మస్ వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. స్థానిక కరుణ సమాజంలో రెడ్ క్రాస్ సంస్థ మరియు అప్ హెల్ప్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు మంగళవారం జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని క్రిస్మస్ కేకును కట్ చేసి పిల్లలకు తినిపించారు. కార్యక్రమంలో 35 మంది కుష్ఠు వ్యాధిగ్రస్తుల కుటుంబాలకు కందిపప్పు, గోధుమ పిండి, ఆయిల్, పంచదార, బియ్యం మరియు దీరలు, లుంగీలు, దుప్పట్లు, దోమ తెరలు, బట్టలు, జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు. అప్ హెల్ప్ సంస్థ నుండి 1,50,000/- రూపాయలు చెక్కును అక్కడ విద్యార్థులకు స్కాలర్ షిప్‌ను అందించారు. తొలుత మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలను వేసి నివాళులు అర్పించిన కలెక్టర్ మాట్లాడుతూ క్రీస్తు బోధనలు అనుసరణీయమని, పొరుగువారిని ప్రేమించాలని క్రీస్తు చెప్పారని తెలిపారు. స్మశాన వాటికకు ప్రహరీ గోడ కావాలని కాలనీ సభ్యులు కోరగా వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ సత్వర చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్

సంస్థ చైర్మన్ పి.జగన్మోహన్ రావు, జిల్లా పౌర సంబంధాల అధికారి కె బాల మాన్ సింగ్, అప్ హెల్ప్ ప్రాజెక్ట్ మేనేజర్ క్రిస్టఫర్, రెడ్ క్రాస్ జిల్లా ఎంసీ మెంబర్లు కళ్యాణ్ చక్రవర్తి, చిన్నంనాయుడు, జి.రమణ, శ్రీ చైతన్యకుమార్, ఉమా శంకర్, పవన్, సునీల్ మోహన్, కరుణ సమాజం కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు సత్వర న్యాయమే లక్ష్యం

– వినియోగదారులు తమ హక్కులు గురించి తెలుసుకోవాలి

– జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

విశాలాంధ్ర - శ్రీకాకుళం: వినియోగదారులు తమ హక్కుల గురించి పూర్తిగా తెలుసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. మంగళవారం బాపూజీ కళామందిర్‌లో జరిగిన వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌర సరఫరాల శాఖ సంయుక్తంగా నిర్వహించిన జాతీయ వినియోగదారుల దినోత్సవ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆమదాల వలస శాసనసభ్యులు కూన రవికుమార్‌లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా వినియోగదారుల సంఘం చైర్మన్ బగాది రామ్మోహనరావు అధ్యక్షత వహించారు. వినియోగదారులు నష్టపోకుండా ఉండేందుకు, మోసపూరిత వ్యాపారస్తులకు అడ్డుకట్ట వేయాలనే లక్ష్యంతో వినియోగదారుల చట్టం అమల్లోకి తీసుకురావడం జరిగిందన్నారు. కూన రవికుమార్ మాట్లాడుతూ సామాన్యుడి మొదలుకొని ధనవంతుడి వరకు అందరూ వినియోగదారులేనని కొనుగోలు చేసిన వస్తు సేవల బిల్లులను పొంది వాటి వారంటీకి అనుగుణంగా తగిన హక్కులను పొందవచ్చు అన్నారు. వివిధ కళాశాలలో నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు ప్రశంసా పత్రాలు, పతకాలు, నగదు బహుమతులను జాయింట్ కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి జి.సూర్య ప్రకాష్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డా. బి.మీనాక్షి, డిసిహెచ్ఎస్ డా కళ్యాణ్ బాబు, జీఎస్టీ సహాయ కమిషనర్ రాణి మోహన్, గంగ ఆర్ ఎజ్రా, శ్రీకాకుళం జిల్లా విజిలెన్స్ మెంబర్, ఎండీయు ఆపరేటర్స్ రాష్ట్ర అధ్యక్షులు గౌతు సూర్యనారాయణ, బుడుమూరు శ్రీరామ్మూర్తి, దేవిశ్రీ ఎంటర్ ప్రైజెస్ గ్యాస్ పాల్గొన్నారు.

రూ.15,485కోట్ల విద్యుత్ ఛార్జీలను పెంచిన చంద్రబాబు

నిరసనగా ఈనెల 27న వైసిపి పోరుబాట

వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

విశాలాంధ్ర - నరసన్నపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి, చంద్రబాబునాయుడు సుమారు రూ.15,485కోట్ల విద్యుత్ ఛార్జీలను పెంచిన కారణంగా ఈనెల 27న రేపిన జిల్లాలో అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో వైసిపి పోరుబాట పేరుతో ఆందోళన కార్యక్రమాన్ని చేపడుతుందని జిల్లా వైసిపి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే, ధర్మాన కృష్ణదాస్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కృష్ణదాస్ మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు అనేక హామీలు ఇచ్చారని, అందులో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే, విద్యుత్ ఛార్జీలు పెంచమని చెప్పారని, అధికారంలోకి వచ్చి ఆరు నెలల్లోనే వేల కోట్ల భారాన్ని రాష్ట్ర ప్రజలపై మోపుతుందని తెలిపారు. అధికమైన విద్యుత్ ఛార్జీలతో ప్రజల నడ్డి విరిగేలా నిర్ణయం తీసుకున్న కూటమి ప్రభుత్వానికి నిరసనగా ఈనెల 27వ

తేదీన చేపట్టే పోరుబాట కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలపాలని కృష్ణదాస్ కోరారు. అనంతరం ఆయన పోస్టర్లను ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయితీ సర్పంచ్, బుర్రల్లి శంకరరావు, నరసన్నపేట, జలుమూరు ఎంపిపిలు, ఆరంగి మురళి, వాన గోపి, వైసిపి జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు, కె.సిహెచ్.బి.గుప్తా వైసిపి నాయకులు, చింతు రామారావు, ముద్దాడ బైరాగినాయుడు, సురంగి నర్సింగరావు, రాజాపు అప్పన్న, ధర్మాన జగన్మోహనరావు, అప్ప రవికుమార్‌రెడ్డి, బొబ్బాది ఈశ్వరరావు, తోట భార్గవ్, కనుసు సీతారాం తదితరులు పాల్గొన్నారు.

కరుణామయుడు ఏసుక్రీస్తు

రవీంద్ర భారతి పాఠశాలల ఛైర్మన్ యం.యస్.మణి

విశాలాంధ్ర-నరసన్నపేట: ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవుల ఆరాధనలు అందుకుంటున్న కరుణామయుడు, దయామయుడు, ఏసుక్రీస్తు అని రవీంద్ర భారతి పాఠశాలల ఛైర్మన్, యం.యస్.మణి అన్నారు. మంగళవారం స్థానిక పెద్దపేట వీధిలో ఉన్న రవీంద్ర భారతి స్కూల్‌లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్, మణి మాట్లాడుతూ నేటికి రెండు వేల సంవత్సరాలు దాటినా ఎంతో పవిత్రంగా క్రిస్మస్ వేడుకలు ఏసుక్రీస్తు పుట్టిన రోజునే ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నారని తెలిపారు. ఏసు అంటే రక్షకుడని, ఆతడు దేవుని కుమారుడు అని అన్నారు. మన జీవితాల్లో జరిగే అన్నింటి నుండి మంచిని తీసుకొని రావటానికి ఏసుక్రీస్తు ఎల్లప్పుడూ కృషి చేస్తున్నాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నారి విద్యార్థులు ధరించిన శాంతా క్లాజ్, మేరీ, జోసెఫ్ వేషధారణలు ఆహుతులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో రవీంద్ర

భారతి పాఠశాల ప్రిన్సిపాల్, ధర్మాన వాసుదేవరావుతో పాటు డీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ జ్ఞానజ్యోతి స్కూల్‌లో క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర-నరసన్నపేట : స్థానిక శ్రీ జ్ఞానజ్యోతి స్కూల్‌లో మంగళవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్కూల్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో చిన్నారి విధ్యార్థులు శాంతాక్లాజ్ వేషాధారణతో పలువురిని ఆకట్టుకున్నారు. ఈ సంధర్భంగా క్రిస్మస్ కేక్‌ను స్కూల్ మేనేజ్‌మెంట్ కట్ చేసి, చిన్నారులకు పంచిపెట్టారు. అనంతరం చిన్నారి విధ్యార్థులు ఆలపించిన యేసుక్రీస్తు పాటలుతో, నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ మేనేజ్‌మెంట్ సభ్యులు, వెలమల భాస్కరరావు, బోర రామారావు, తర్ర సత్యన్నారాయణ, పాగోటి లక్ష్మీ, స్కూల్ ఉపాధ్యాయ సిబ్బంది, విధ్యార్థులు పాల్గొన్నారు.

ఎయిర్ పోర్టును ఆహ్వానిస్తున్నాం...

- ఉద్దానం గుండెకాయ కోస్తామంటే సహించం
- ప్రజల అభిప్రాయాలను ప్రభుత్వం గౌరవించాలి
- నగరంపల్లిలో 1800 ఎకరాల సాల్ట్ భూములు అవి
- పరిశీలించాలని సూచన
- ప్రజలకు అభ్యంతరం లేని ప్రాంతాల్లో పోర్టు నిర్మించండి
- జిల్లా అభివృద్ధికి వైసీపీ బీజం వేసింది
- రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

విశాలాంధ్ర-పలాస : స్వాతంత్ర్య కాలం నుండి ప్రభుత్వాలు పాలకులు పట్టించుకోకపోవడంతో అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురైన శ్రీకాకుళం జిల్లా, ఉద్దాన ప్రాంత భవిష్యత్ కోసం తెచ్చే ఎయిర్ పోర్ట్ లాంటి అభివృద్ధి ప్రాజెక్టులు తీసుకొస్తే ఆహ్వానిస్తామని రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పేర్కొన్నారు. స్థానిక వైసీపీ కార్యలయం ప్రగతి భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. స్థానిక ప్రజలు వ్యతిరేకించడం ఫలితంగా భావనపాడు పోర్టు పనులు ముందుకు సాగక అనేక దశాబ్దాల కాలంగా పెండింగ్ ఉండిపోయిందని, 2019లో రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత నిర్వాసితుల సంఖ్యను తగ్గించి, పోర్టు డిజైన్‌ను మార్చి, ప్రజల అనుమతితో మూలపేట పోర్ట్ పనులు ప్రారంభించామని చెప్పారు. ఈరోజు జిల్లా అభివృద్ధి కోసం జరుగుతున్న చర్చకు వైసీపీ పాలనలోనే బీజం పడిందన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో జిల్లా అభివృద్ధి కోసం ప్రయత్నాలు చేస్తున్న క్రమంలో ప్రజల అభిప్రాయాలను గౌరవించ కుండా, కనీసం వారికి సమాచారం లేకుండా ఎయిర్ పోర్టు నిర్మాణం కోసం అని రెవిన్యూ అధికారులు భూములు పైకి వెళ్లడం అక్కడ ప్రజలను ఆందోళన కలిగించిందన్నారు. ప్రభుత్వాలు ప్రజల మనోభావాలను గౌరవించాలని, అభిప్రాయాన్ని స్వీకరించాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా మూలపేట పోర్టు పనులు ఏ విధంగా ల్యాండ్ చేశామో, అదే తరహాలో ప్రజలు రైతులు నష్టపోకుండా ఉద్దానం ప్రాంతంలో ప్రభుత్వం ఆలోచన మేరకు 1300 ఎకరాల్లో ఎయిర్పోర్ట్ నిర్మాణం చేయవచ్చు అన్నారు. వజ్రపు కొత్తూరు మండలం నగరంపల్లి పంచాయతీ పరిధిలో 1800 ఎకరాల భూములు కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సాల్ట్ భూములు ఉన్నాయని వివరించారు. ఆ భూములను ఎయిర్ పోర్టుకు అనుకూలంగా అభివృద్ధిచేసి నిర్మాణం చేసుకోవచ్చున్నారు. మూలపేట పోర్టు సమీపంలో పోర్టుకు అనుబంధంగా 9 వేల ఎకరాలు ల్యాండ్ బ్యాంక్ సాల్ట్ భూములను వైసిపి ప్రభుత్వం కేటాయించిందని విషయాన్ని గుర్తు చేశారు. అత్యధిక ప్రభుత్వ భూములు ఉన్నచోట ఇటువంటి ఏర్పోర్ట్ నిర్మాణం చేయాలని కోరారు. ఒరిస్సాలో గోపాలపురం పోర్టు, మూలపేట పోర్టు, బుడగట్లపాలెం పోర్టులకు అనుబంధంగా ఏర్పడనున్న పరిశ్రమలు, వాటి అవసరాలకు ఈతీర ప్రాంతంలో ఎయిర్ పోర్ట్ వస్తే ఉద్దానంలో అభివృద్ధి పరుగులు పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దీనితో పాటు ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో షెడ్యూల్ 13లో పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏపీలో ఏర్పాటుకు కేంద్రం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇప్పటికే పేట పోర్టు వద్ద కేటాయించిన తొమ్మిది వేల ఎకరాల భూములల్లో 4 వేల ఎకరాల్లో పెట్రో కెమికల్ కాంప్లెక్స్ తీసుకొస్తే వేలాది మంది యువతకి ఉపాధి అవకాశాలు వస్తాయి అన్నారు. జిల్లా నుండి ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడుకు కూటమి ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా మంచి అవకాశం లభించింది అన్నారు. తనకు ఉన్న అవకాశాలతో జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఉపాధి అవకాశాలు తీసుకొచ్చే అభివృద్ధి ప్రాజెక్టులు తెస్తే తానే కింజరాపు రామ్మోహన్ నాయుడు చేసిన అభివృద్ధి కోసం గల్లీ గల్లీలో చెబుతానని అన్నారు. జిల్లా అభివృద్ధి కోసం మాత్రమే సూచనలు చేస్తున్నామని, రాజకీయ కోణంతో చూడొద్దని కోరారు. మీడియా సమావేశంలో మందసా ఎంపీపీ డొక్కర దానయ్య, పలాస ఎంపీపీ ప్రతినిధి ఉంగ సాయి కృష్ణ, వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి శిష్టు గోపి, పలాస మాజీ ఎంపీపీ బత్తిన హేమేశ్వరరావు, నగరంపల్లి సర్పంచ్ ప్రతినిధి దువ్వాడ మధు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పవనపుత్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్విజ్ పోటీలు

మొదటి విజేత జిల్లా పరిషత్ హైస్కూల్ హరిపురం

విశాలాంధ్ర-పలాస: స్థానిక ప్రతిభ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జాతీయ రైతు దినోత్సవ సందర్భంగా మంగళవారం జిల్లా స్థాయి క్విజ్ పోటీలు మరియు రైతులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు తెప్పల అజయ్ కుమార్, వాయులపల్లి మాధవరావు, రైతులు పల్లి చంద్రయ్య, అట్టాడు దుర్యోధన, గార రుద్రయ్య, సైన కామేశ్వరరావు, పోలాకి రాములు , పద్ద మాధవరావు, పల్లి నాగభూషణంలను పలాస డి.ఎస్.పి వెంకట అప్పారావు మరియు ఏ డి ఓ మధులు రైతులను ఘనంగా సన్మానించారు. అనంతరం డియస్‌పి మాట్లాడుతూ విద్యార్థులు రైతాంగం పట్ల అవగాహన పెంచుకొని, రైతులకు లాభసాటి వ్యవసాయానికి అవసరమైనటువంటి మార్పులను తీసుకురావాలని సూచించారు. జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో మొత్తం 56 బృందాల్ను పాల్గొనగా స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా పది బృందాలను రెండో రౌండ్ కు ఎంపిక చేయడం జరిగిందని నిర్వాహకుల్ను తెలిపారు. స్క్రీనింగ్ టెస్ట్ లో ఎంపికైన బృందాలకు క్విజ్ పోటీలు నిర్వహించగా మొదటి స్థానం జడ్పీహెచ్ స్కూల్ హరిపురం, రెండవ స్థానం శ్రీ సాయి శిరీష హై స్కూల్, మూడవ స్థానం జడ్పీహెచ్ స్కూల్ లోహరిబంద, తరువాతి స్థానాలు వరుసగా శ్రీ సాయి శిరీష స్కూల్, జడ్పీహెచ్ స్కూల్ మామిడిపల్లి, జడ్పీహెచ్ స్కూల్ మందస, జడ్పీహెచ్ స్కూల్ సోండిపుడి, మేధా హై స్కూల్ పలాస, జె వై స్కూల్ పలాస, ఏపీ మోడల్ స్కూల్ సోంపేట నిలిచాయి. క్విజ్ పోటీలు విజేతలకు ఆంధ్రప్రదేశ్ టీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, పలాస ఎండిఓ కే వసంత కుమార్, వజ్రపుకొత్తూరు ఎండిఓ యన్ రమేష్ నాయుడు, మాజీ గ్రంథాలయ చైర్మన్ పీరికట్ల విఠల్, ప్రముఖ వైద్యులు డాక్టర్ చిన్నం నాయుడు, హెంబాబు చౌదరి, ముంజేటి పాపారావు, ఐ యన్ రావు, కిషోర్, బంటుపల్లి భీమరాజు, నిమ్మన పాపారావులు బహుమతులు ప్రధానం చేశారు. వజ్జ బాబురావు మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీ తత్వం పెంచుకోవాలని ఇలాంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులలో ఉన్న టాలెంట్ ను బయటికి తీయవచ్చని అన్నారు. పవనపుత్ర సేవా సంస్థ ఎన్నో మంచి కార్యక్రమాలు చేపడుతుందని వారందరికీ ఈసందర్భంగా అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పవనపుత్ర సేవా సంస్థ వ్యవస్థాపకులు మజ్జి భాస్కరరావు, అధ్యక్షులు ఆశపన్న బాలరాజు, సభ్యులు కొల్లి ఫల్గుణరావు, హనుమంతు జనార్ధన్, రుంకు తారకేశ్వరరావు, అగురు అశోక్, పత్రి చిరంజీవి, దుగాన తిరుపతిరావు, పత్రి ఈశ్వరరావు, రాజమండ్రి అజయ్, మరియు సభ్యులు, వాలంటీర్లు, విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏపీయూడబ్ల్యూజే టెక్కలి ప్రెస్ క్లబ్‌ని బలోపేతం చేద్దాం

- ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బెండి నర్సింగరావు

విశాలాంధ్ర-టెక్కలి: ఏపీయూడబ్ల్యూజే టెక్కలి ప్రెస్ క్లబ్ ని బలోపేతం చేద్దామని ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బెండి నర్సింగరావు అన్నారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే టెక్కలి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో వనభోజన మహోత్సవ కార్యక్రమాన్ని రామకృష్ణ మఠం సమీప మామిడి తోటలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఇటీవలే కాలంలో మృతి చెందిన తొలితరం జర్నలిస్ట్ పీఏ పంతులు ఆత్మకి శాంతి చేకూరాలని జర్నలిస్టులు మౌనం చేపట్టారు. అనంతరం అధ్యక్షులు నర్సింగరావు మాట్లాడుతూ ఏపీయూడబ్ల్యూజే అనే సంఘం రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన ఏకైక సంఘం ని కొనియాడారు. అలాంటి సంఘంలో మనం సభ్యులుగా ఉండడం మనకి ఎంతో గౌరవం అని అన్నారు. ప్రతి ఒక్కరూ సంఘానికి సహకరిస్తూ ఏపీయూడబ్ల్యూజే టెక్కలి ప్రెస్ క్లబ్ నీ బలోపేతం చేయాలని, జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమమే ధ్యేయంగా ప్రెస్ క్లబ్ పనిచేస్తుందని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. అనంతరం ప్రెస్ క్లబ్ లో ఉన్న సమస్యలపై సభ్యులతో చర్చించుకున్నారు. పీఏ పంతులు మృతి చెందడం టెక్కలి ప్రెస్ క్లబ్ కి ఎంతో లోటని పేర్కొన్నారు. మృతి చెందిన పీఏ పంతులు కుటుంబానికి ఎంతో సహాయాన్ని అందజేసిన రాజేష్ సేవలను గుర్తించి ఘనంగా సత్కరించారు. ఇటీవలే డాక్టరేట్ సాధించిన వెంకటేష్ ని గుర్తించి సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటేష్ పీఏ పంతులు కుటుంబానికి 10వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. అనంతరం సీనియర్ జర్నలిస్టులు ప్రెస్ క్లబ్ సెక్రటరీ నర్సిపురం శేఖర్ నీ, శ్రావణ్, దువ్వాడ లక్ష్మీనారాయణ నీ ఘనంగా సత్కరించి సన్మానించారు. అనంతరం ప్రెస్ క్లబ్ సభ్యులు విందు వినోదాలతో ఆనందించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మేజర్ పంచాయితీ అభివృద్ధి 'టిడిపితోనే సాధ్యం'

విశాలాంధ్ర-పొందూరు: పొందూరు మేజర్ పంచాయితీని బహు సుందరమైన అభివృద్ధి టిడిపి తోనే సాధ్యమని మండల టిడిపి అధ్యక్షులు చిగిలిపల్లి రామ్మోహనరావు అన్నారు. స్థానిక అక్కమాంబ పేరంటాల ఆలయం వద్ద నుండి కాకర్ల నర్సింగ్ హోమ్ కు వెళ్లే రహదారి సీసీ రోడ్ల నిర్మాణానికి మంగళవారం భూమి పూజ చేసిన అనంతరం మాట్లాడుతూ పై విధంగా అన్నారు. టిడిపి మినహా ఏ ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చినా పొందూరు మేజర్ పంచాయితీకి అభివృద్ధి చేసే దాఖలాలే లేవన్నారు. చినుకు పడితే ప్రజలు చిత్రహింసలు పడే గ్రామం ఇది, జారు బురదతో ప్రజలు పడుతున్న ఇక్కట్లను చూసి కల్లప్పగించి చూసిన ఆనాటి అధికార పార్టీలైన కాంగ్రెస్, వైసీపీలు వల్ల ఒరిగేదేమీ లేదన్నారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ సారాధ్యంలో కోట్లాది రూపాయలు విచ్చించి మంజూరైన నిధులు తో ప్రజా సౌకర్యార్థం సీసీ రోడ్లు నిర్మించారన్నారు. బత్తుల వీధి, సూర్యోదయ వీధి నుండి పోలీస్ స్టేషన్ వరకు, లావేటి వీధి నుండి రెల్లి వీధి జంక్షన్ వరకు అలాగే గొల్ల వీధి, వాండ్రంగి వీదుల్లో సరవేగంగా సిసి రోడ్లు నిర్మాణం చేపట్టమన్నారు. అన్నిటికంటా నేడు భారీ ఎత్తున రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేపట్టామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని మన ఎమ్మెల్యే నిలబెట్టుకుని చూపించారని ఆయన అన్నారు. మండల హెడ్ క్వార్టర్ పొందూరును అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. ముందుగా స్థానిక పట్టణ పార్టీ అధ్యక్షులు అనకాపల్లి శ్రీ రంగనాయకులు (చిన్న రంగా) సర్పంచ్ రేగిడి లక్ష్మి ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోక్షరణల మధ్య భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు మహిళా విభాగ్ ప్రతినిధి మాజీ సర్పంచ్ అనకాపల్లి విజయలక్ష్మి, మండల పార్టీ ఉపాధ్యక్షులు బడాన శేషగిరి నాయుడు, జిల్లా తెలుగు యువనేత బలగ శంకర భాస్కరరావు, నీటి సంఘాల అధ్యక్షులు అనకాపల్లి సత్యం, దేశం నేతలు కాలేపు శ్రీనివాసరావు, అనేం పాపారావు, అనకాపల్లి అప్పలస్వామి ,పోలాకి బాలకృష్ణ, అనకాపల్లి శంకర్, కొండల రాజారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన పోస్టర్లు ఆవిష్కరణ

- 27న టెక్కలిలో విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట నిరసన

విశాలాంధ్ర-టెక్కలి: విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ఈనెల 27వ తేదీన టెక్కలి విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని వైసిపి టెక్కలి నియోజకవర్గం ఇంచార్జ్ పేరాడ తిలక్ తెలిపారు. నిరసన కార్యక్రమానికి సంబంధించి పోస్టర్లను మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయం వద్ద నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలల్లోనే 15 వేల కోట్ల రూపాయల అదనపు భారాన్ని వినియోగదారులపై వేసి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ఎన్నికల హామీలో భాగంగా విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చంద్రబాబు నాయుడు వాగ్దానం చేసి ప్రజల దగ్గర ఓట్లు వేయించుకొని ఆరు నెలల్లోనే మోసానికి పాల్పడ్డారని అన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంపుతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ వెంటనే విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ టెక్కలిలో ఈనెల 27వ తేదీ ఉదయం 9 గంటలకు ర్యాలీ నిర్వహించి విద్యుత్ శాఖ ఏడి కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి విద్యుత్ శాఖ అధికారులకు వినతి పత్రం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్కలి నియోజకవర్గంలోని వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు కార్యకర్తలు, అభిమానులు అందరూ వినియోగదారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నందిగాం, సంతబొమ్మాలి, కోటబొమ్మాలి, టెక్కలి మండలాలకు సంబంధించిన ప్రజాప్రతినిధులు సర్పంచ్లు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గణితంలో రాణిస్తే ఉన్నతస్థాయికి...

- శ్రీ కళ్యాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ లోళ్ల రాజేష్

విశాలాంధ్ర-కవిటి: విద్యార్థులు గణితంలో రాణిస్తేనే ఉన్నతస్థాయికి ఎదుగుతారని శ్రీ కళ్యాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంటు లోళ్ల.రాజేష్ అన్నారు.గణిత శాస్త్ర దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కవిటిలోని కళ్యాణి స్కూల్లో 1 నుండి 5వ తరగతి విద్యార్థులకు టాలెంటు టెస్ట్ నిర్వహించారు. గెలిపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ మానవుడి జీవితం గణితంతో ముడిపడి ఉందని తెలిపారు. రామానుజం లెక్కల్లో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎదిగారో విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటర్ రాణి, ప్రిన్సిపాల్ బిందుమాధవి మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు అలవెన్సులు మంజూరు

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలంలో భవిత కేంద్రంలో శిక్షణ పొందుతున్న ప్రత్యేక అవసరాల పిల్లలకు అలవెన్సులు మంజూరైనట్లు మండల విద్యాశాఖ అధికారులు 1, 2 ధనుంజయ మజ్జి,కె. చిట్టిబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024- 25 విద్యా సంవత్సరంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు రూ.2.17 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఇందులో ఎలిమెంటరీ ట్రాన్స్పోర్ట్ అలవెన్సు రూ.45 వేలు, సెంకడరీ ట్రాన్స్పోర్ట్ అలవెన్స్ రూ. 18 వేలు, ఎలిమెంటరీ ఎస్కార్ట్ అలవెన్స్ రూ.48 వేలు,సెకండ్రీ ఎస్కార్ట్ రూ.6 వేలు,ఎలిమెంటరీ గర్ల్స్ స్టైఫండ్ రూ. 70 వేలు, హెచ్చిఈ అలవెన్స్ రూ. 30 వేలు మంజూరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక అవసరాల పిల్లల ఇంటికి వెళ్లి నిధులు మీ అకౌంట్లో జమ అయినది లేనిది తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పి లమ్మత కృష్ణారావు,ఎమ్మార్సీ సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.

కాలనీలో సమస్యలను పరిష్కరించండి

- ఎమ్మెల్యేకు మొర పెట్టుకున్న జగనన్న కాలనీవాసులు

విశాలాంధ్ర-రణస్థలం : గత ప్రభుత్వ హయంలో ఏర్పాటు చేసిన కాలనీల్లో మౌలిక వసతులపై అంతగా దృష్టి సారించక పోవడం కారణంగా చాలా ఇబ్బందులు పడుతున్నామని తమ కాలనీలకు శాశ్వత ప్రాతిపాదికన సిమెంటు రహదారులు, మురుగు కాల్వలు ఏర్పాటు చేయాలని మంగళవారం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావుని ఎచ్చెర్ల జగనన్న కాలని వాసులు కలిసి తమ గోదు వెల్లబుచ్చుకున్నారు. ఈ సందర్భంగా కాలనీలో మౌళిక సదుపాయాల కల్పనకు అవసరమైన ఏర్పాట్లు చేయడానికి ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తుందని, ప్రజల సంక్షేమం అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. నాయకులు గాలి వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

పల్లెల్లో సంక్రాంతి పర్వదినాలు సందర్భంగా గంగిరెద్దుల సందర్శన

విశాలాంధ్ర-జలుమూరు : హిందూ సాంప్రదాయ ప్రకారం సంక్రాంతి పర్వదినాలు వస్తున్నాయి అనగానే పల్లెల్లో ధనుర్మాసం ఏర్పడిన తర్వాత సంబరాలు వేడుకలు ప్రారంభం అవుతాయి మంగళవారం జలుమూరు మండలం చల్లవానిపేట గ్రామంలో డు డూ బసవన్న సింహాద్రి అప్పన్న అంటూ గంగిరెద్దులకు ప్రజలు పలు పూజలు చేసి వారికి కలిగిన వస్త్ర ధన ధాన్యములు అందిస్తుంటారు. ఇది పురాతన సాంప్రదాయకంగా నేటికీ గ్రామాల్లో ఈ సంబరాలు కనిపిస్తుంటాయి కనువిందు అయిన ఈ ఆచారాన్ని అన్ని వర్గాల వారు చేపట్టుకుంటారు.

నాటుసారా తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవు... ప్రొబిషన్స్ కోట కృష్ణారావు

విశాలాంధ్ర-జలుమూరు : గ్రామీణ ప్రాంతాల్లో నాటు సారా తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవని పాతపట్నం ప్రొవిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ కోట కృష్ణారావు అన్నారు పాతపట్నం మండలం పూతిక గూడ గ్రామంలో మంగళవారం నిర్వహించిన దాడుల్లో అదే గ్రామానికి చెందిన సవరపార్వతి అనే మహిళ 2.5 లీటర్ల నాటు సారా తో పట్టుబడిందింని కృష్ణారావు తెలిపారు అరెస్ట్ చేసి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ నరసన్నపేట హాజరు పరచగా జనవరి 3 వరకు రిమాండ్ ఇచ్చారని ఆమెను పాతపట్నం సబ్ జైలుకు తరలించినట్లు సీఐ కృష్ణారావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నాటు సారా పై ఉక్కు పాదం మోపడం అయినదని నవోదయ 2.0 అనే ప్రతిష్టాత్మకమైన కార్యక్రమం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నాటు సారా రైతరాష్ట్రంగ రూపకల్పన చేయదానికి ప్రణాళిక సిద్ధం చేశామని ఎవరైనా నాటు సారాతో దొరికితే వారికి చట్టపరమైన చర్యలు తప్పవు అని అన్నారు. డ్వాక్రా సంఘాలు యువజన సంఘాలు సంయుక్తంగా దీనిపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులకు కంప్యూటర్ కోర్సులో శిక్షణ

విశాలాంధ్ర-మందస: మండలం హరిపురం శ్రీ నాసా కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో కోర్సు కంప్లీషన్ ఫర్ సర్టిఫికెట్ కొరకు విద్యార్థులకు మంగళవారం విజయవంతంగా పరీక్షలు నిర్వహించినట్లు శ్రీ నాసా శిక్షణ కేంద్రం డైరెక్టర్ మద్దు భీమారావు, ఇంచార్జి బూరగాపు దేవరాజు లు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడితూ విద్యార్థులు భవిష్యత్ లో ఉన్నత ఉద్యోగాలలో చేరేందుకు దానికి అనుగుణంగా శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.ప్రస్తుత కాలంలో కంప్యూటర్ ఆవశ్యకత దృష్ట్యా విద్యార్థులకు 6 నెలలు నుండి సంవత్సరం కాల పరిమితి గల పి.జి. డి.సి.ఎ, డి.సి.ఎ, ఆఫీసు ఆటోమేషన్, ఏం.ఎస్.ఆఫీసు, సి లాంగ్వేజ్ వంటి వివిధ కోర్సులలో శిక్షణ ఇవ్వడం జరిగిందని, తదనంతరం విద్యార్థులు కోర్సు సర్టిఫికెట్ కొరకు పరీక్షలు నిర్వహించడం జరిగిందని ఇంచార్జి దేవరాజు తెలిపారు. శ్రీ నాసా డైరెక్టర్ భీమారావు మాట్లాడుతూ మరి కొన్ని రోజుల్లో వెలువడనున్న జాబ్ క్యాలెండర్ అణుగుణంగా శ్రీ నాసా కంప్యూటర్ శిక్షణ కేంద్రం ద్వారా ఉచితంగా ప్రభుత్వ ఉద్యోగ (కాంపిటేటివ్ కోచింగ్) సాధన మరియు ప్రభుత్వ విద్యా కోర్సులు(ఎంట్రన్స్ ఎగ్జామ్స్) కై విద్యార్థులకు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన శిక్షణ నిపుణులచే తరగతులు కూడా నిర్వహించబడుతుందని తెలిపారు. పేద విద్యార్థులు దృష్టిలో పెట్టుకుని కొన్ని పెయిడ్ కోర్సులలో 50శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ కమ్ స్టూడెంట్ కో ఆర్డినేటర్ రేవతి,ఫ్యాకల్టీ రేణుక,జూనియర్ ఫ్యాకల్టీ ఓంకార్,పవన్, భవ్య తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ బాధితులకు పునరావాస పరికరాలు పంపిణీ

విశాలాంధ్ర-పలాస : జాతీయ ఫ్లోరోసిస్ నివారణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రెంటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సునీల్ ఆధ్వర్యంలో ఫ్లోరోసిస్ బాధితులకు రిహాబిలిటేషన్ (పునరావాస పరికరాలు) పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పి. హెచ్.సి.పరిధిలో గల గ్రామాలలో ఫ్లోరోసిస్ ప్రభావిత ప్రాంతాలలో, గ్రామాలలో సర్వే నిర్వహించి వివిధ రకాలైన ఫ్లోరోసిస్ అనుమాదాస్పద బాధితులను గుర్తించి వారికి మూత్ర, రక్త పరీక్షలను సేకరించి వాటిని జిల్లా కేంద్రానికి పంపించి నిర్ధారించడం జరిగిందని తెలిపారు. వారికి పునరావాస సహాయక చర్యలు చేపట్టి అవసరమైన వారికి స్టిక్స్, వాకర్స్. లంబార్ బెల్ట్ అందించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ లకినేని అరుణజ్యోతి,పీహెచ్ ఎన్ సత్యవతి, హెచ్ వి ఈశ్వరమ్మ, మేరీ బాయ్,ఎం ఎల్ హెచ్ పి, ఏఎన్ఎమ్స్, ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెంకటాచలంకు రాష్ట్ర కన్స్యూమర్ అవార్డు

విశాలాంధ్ర-పలాస: వినియోగదారుల సేవలు మరియు వారికి చైతన్యవంతం చేసే కార్యక్రమాలు గత రెండు దశాబ్దాలుగా చేస్తున్న వెంకటాచలంకు జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పౌరసరఫరాలు మరియు వినియోగదారుల వ్యవహారాలు కమిషనర్ జి వీర పాండ్యన్ లు అవార్డు అందించారు. వెంకటాచలం నందిగా%శీ% మండల వినియోగదారుల సంఘం అధ్యక్షుడిగా రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య వైస్ చైర్మన్ గానే కాకుండా జిల్లా వినియోగదారుల క్లబ్బులు మాస్టర్ ట్రైనీగా గత రెండు సంవత్సరాల నుండి వ్యవహరిస్తూ విద్యార్థులను చైతన్య పరుస్తూ పలు కార్యక్రమాలు చేస్తున్నారు ఈ అవార్డు లభించడం పట్ల జిల్లా వినియోగదారుల సంఘాల సంఘం వినియోగదాల సంఘాల సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు బగాతి రామ్మోహన్ రావు బమ్మిడి నరేంద్ర కుమార్ పౌరసరఫరాల అధికారి జి సూర్యప్రకాశరావు దువ్వాడ జనార్ధన్ రావు ఉప్పాడ రమేష్ అభినందించారు.

పంటను జాగ్రత్త చేసుకోవాలి

- మొలకలు రాకుండా ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలి
- శాస్త్రవేత్త డాక్టర్ అనూష

విశాలాంధ్ర-కవిటి: రైతులు కోసిన పంటను గట్లపై వేసి ఆరబెట్టుకొని,మొలకలు రాకుండా ఉప్పునీటి ని పిచికారి చేయాలని ఆముదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ అనూష తెలిపారు. ఈ మేరకు మంగళవారం కవిటి మండలం కవిటి, పుటియదల, పుక్కళ్లపాలెం గ్రామాల్లో పర్యటించి రైతులు కోసిన వరి పనలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం రైతులకు చాలా నష్టం వాటిల్లిందని ఉన్నవాటిని జాగ్రత్త చేసుకునే విధంగా రైతులకు పలు సూచనలు చేశారు.దీనిపై రైతులు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పంటను గట్లపై ఆరబెట్టుటకు, మీ సూచనలు పాటించడానికి, ఇతర పనుల కోసం కూలీల ఖర్చులు భరించలేమని తెలిపారు. ఈ సందర్భంగా సోంపేట సహాయ సంచాలకులు జగన్మోహనరావు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పరిస్థితులను ఉన్నతాధికారులకు తెలియజేసి రైతులు న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోంపేట, కవిటి మండలల వ్యవసాయ అధికారులు బొర్ర నరసింహమూర్తి, బడగల.దుర్గాప్రసాద్, వ్యవసాయ సహాయకులు మాదిన సమన్వయ, మాజీ జడ్పీటీసీ బి.రమేష్, రైతులు ఆరంగి అనిల్, బి.చక్రధర్, వై.తిరుపతి, పీ. వేణు, కె.బాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నూతన శాఖను తెరవనున్న యుటిఐ మ్యూచువల్ ఫండ్

విశాలాంధ్ర-శ్రీకాకుళం : భారతదేశంలోని ప్రముఖ అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థల్లో ఒకటైన యుటిఐ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (యుటిఐ ఏఎంసి), ఆంధ్ర ప్రదేశ్‌లోని శ్రీకాకుళంలోని ఎస్వీ కామేశ్వరి కాంప్లెక్స్ వద్ద తమ యూఎఫ్‌సి నూతన శాఖని ప్రారంభించనున్నట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. 26 డిసెంబర్ 2024న దక్షిణ, తూర్పు ఉత్తర భారతదేశం అంతటా 16 కొత్త యుటిఐ ఫైనాన్షియల్ సెంటర్‌లను (శాఖలు) ప్రారంభిస్తున్నట్లు కంపెనీ ప్రకటించిందన్నారు. ఆర్థిక చేరికను ప్రోత్సహించడానికి మ్యూచువల్ ఫండ్ పెట్టుబడుల ద్వారా ప్రధాన స్రవంతి ఆర్థిక పర్యావరణ వ్యవస్థలోకి బి 30 నగరాల నుండి పెట్టుబడిదారులను తీసుకురావడానికి దేశవ్యాప్తంగా తమ పరిధిని విస్తరించాలని యుటిఐ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఇమ్తైయాజుర్ రెహమాన్, ఎండి మరియు సీఈఓ మాట్లాడుతూ "మేము వ్యూహాత్మకంగా యుటిఐ ఫైనాన్షియల్ సెంటర్‌లను ప్రారంభిస్తున్నామన్నారు. మా ఆఫరింగ్‌ల యొక్క పూర్తి శ్రేణిని వినియోగదారులకు చాలా దగ్గరగా అందుబాటులో ఉండేలా చూస్తామనన్నారు. గత కొద్దికాలంగా మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులలో వ్యక్తిగత పెట్టుబడిదారుల భాగస్వామ్యంలో పెరుగుదల, ముఖ్యంగా బి 30 నగరాల్లో, మా విస్తరణ చాలా ప్రోత్సాహకరంగా ఉందన్నారు. ఆర్థిక సేవలను సులభతరం చేయడం, అవగాహన కల్పించడం మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులను అందరికీ అందుబాటులో ఉంచడం వంటి దీర్ఘకాలిక లక్ష్యాలకు అనుగుణముగా ఇవి ఉంటాయి" అని అన్నారు.

పార్టీ సభ్యత్వమే ప్రతి కుటుంబానికి ఆర్థిక సహాయం పార్టీ లక్ష్యం

విశాలాంధ్ర-జలుమూరు: నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి ఆధ్వర్యంలో ప్రతి కార్యకర్త నాయకులు సమిష్టిగా పనిచేసే అధిక సభ్యత్వాలు చేశారని దీనితో పార్టీలో నూతన ఉత్తేజం వచ్చిందని సారవకోట మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కత్తిరి వెంకటరమణ అన్నారు సారవకోట మండలం కోత అద్ద వనస వంచాయతీ కొత్తూరు ఎస్సీ వీధిలో గడ్డిపేట గ్రామాల్లో సభ్యత్వం పంచాయతీలో ఇచ్చిన టార్గెట్ పూర్తి చేయడం జరిగిందని ఇంకా కొన్ని పంచాయతీలు టార్గెట్టుకు దగ్గరగా ఉన్నవని కత్తిరి వెంకటరమణ అన్నారు మండలంలో నూతన గృహాలు మంజూరుకు రేషన్ కార్డ్స్ మరియు పెన్షన్లకు ఎన్నో విజ్ఞప్తులు వచ్చాయని వీటిని శాసనసభ్యులు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు ఆయనతోపాటు టిడిపి నాయకులు భోర ధర్మారావు వరుదు గోవిందరావు తల సముద్రం నాగేశ్వరరావు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.